విద్యుత్ భవన్‌లో స్వచ్ఛ దివస్


విద్యుత్ భవన్‌లో చెత్త తొలిగిస్తున్న ఎస్‌ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: దాసన్నపేట విద్యుత్ భవన్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ మువ్వ లక్ష్మణరావుతో పాటు మిగతా అధికారులు, సిబ్బంది విద్యుత్ భవన్ ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలిగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో డీజీఎం కె.వి.సూర్యనారాయణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వి.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి.సురేష్, పి.త్రినాథ్, కె.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

విజయనగరం ఫోర్ట్: పీహెచ్‌సీలను ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిర్వహించారు. కార్యాలయంలో ఆవరణంలో చెత్త, చెదారాన్ని, తుప్పలను తొలిగించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ అచ్చుతకుమారి, ఎన్‌సీడీ పి.ఓ డాక్టర్ సుబ్రమణ్యం, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో..

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రజా రవాణా శాఖ సిబ్బంది స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలిత జిల్లా ప్రజా రవాణ శాఖ అధికారి (డీపీటీఓ) సీహెచ్.అప్పలనారాయణ ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం నుంచి పార్శిల్ విభాగం, డిస్పెన్సరీ, డిపో ప్రధాన ద్వారం మీదుగా విశాఖ, సింహాచలం బస్‌స్టాపులు, కాంప్లెక్స్ అవుట్ గేట్ వరకు పరిసరాలను శుభ్రపరిచారు. డిపో మేనేజర్ జే.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు బీ.ఆదినారాయణ, ఎంకేఎంరాజు, పి.సత్యనారాయణ, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది మరియు ఇతల సిబ్బంది సుమారు 50 మంది వరకు పాల్గొన్నారు.


విజయనగరం అర్బన్: పారిశుధ్య పనుల్లో ఆర్టీసీ డీపీటీఓ అప్పలనారాయణ తదితరులు


విజయనగరం ఫోర్ట్: డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద చెత్తను తొలిగిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి


నెల్లిమర్ల: రామతీర్థంలో నిర్వహించిన ర్యాలీ


పూసపాటిరేగ: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ గోవింద తదితరులు

క్లుప్తంగా

అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం రూరల్: కేఎల్‌పురంలోని శ్రీరాధాకృష్ణ ఆలయ వ్యవస్థాపకులు, దివంగత మాతా వరలక్ష్మీ చతుర్థ వర్ధంతిని పురష్కరించుకుని ఆమె కుటుంబ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ద్వారపూడి గ్రామంలో ఉన్న గాంధీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గంటా పార్ధసారధి మాట్లాడుతూ మాతావరలక్ష్మీ చేసిన ఆధ్యాత్మిక సేవలు ఎనలేనివన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో పాటు స్వయంగా ఆలయాన్ని నిర్మించి కాలనీకి ధారాదత్తం చేసిన ఆమెకు కాలనీవాసులు అంతా రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయం అర్చకులు శర్మ, రాజులమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి


సతివాడలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ నరేష్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్ అన్నారు. మండలంలోని సతివాడలో 71వ ప్రాంతీయ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్, రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యన్నారాయణ, గ్రామ పెద్దలు ఆల్తి బెనర్జీ, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నెల్లిమర్ల: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నెల్లిమర్లలో నిర్వహించారు. రామతీర్ధం జంక్షన్‌లో ఉన్న నందమూరి విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి తిరువీధిని ప్రారంభిస్తున్న డాక్టర్ మండపాక రవి, తదితరులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాలు, ఆదిభట్ల నారాయణదాసు 80వ సంస్మరణోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి అంబటిసత్రం మీదుగా వేదిక వరకూ త్యాగరాజు, నారాయణదాసుల చిత్రపటాలతో జమ్ము అప్పన్న బృందం ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం పంచరత్న కృతులతో గాననీరాజనం చేశారు. సాయంత్రం గాత్ర కచేరీలు చేశారు. ప్రముఖ సీనియర్ వేణుగాన విద్వాంసులు మోడేకుర్తి వెంకట కామేశ్వరరావు త్యాగరాజ ప్రత్యేక వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మండపాక రవి, మహదాసు శ్యామ్ నీలాద్రి, భానుహర్ష, నీలాద్రి, పి.చిన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌ను సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: విద్యుత్ సమస్యలపై నిర్వహించనున్న గ్రీవెన్స్‌సెల్‌ను బాధిత వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినియోగదారుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన చంద్రోశేఖరరావు తాను షెడ్యూల్ కులానికి చెందినప్పటికీ, విద్యుత్ బిల్లు రూ. 30 వేలు పెండింగ్‌లో ఉందని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు స్పందించి అతని మీటర్ తనిఖీ చేయగా..ఎస్సీకి బదులు బీసీ అని పడడంతో అతనికి రావాల్సిన రాయితీలు అందలేదని.. ఇది పంచాయతీలో జరిగిన పొరపాటుగా గుర్తించి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం మరికొంతమంది పలు సమస్యలను తెలియజేశారు.

సమయపాలన పాటించాలి


పూసపాటిరేగ వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న మాజీ ఎంపీపీ చిన్నంనాయుడు తదితరులు

పూసపాటిరేగ: పూసపాటిరేగ పీహెచ్‌సీలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు వైద్యాధికారి రాజేష్‌వర్మని ప్రశ్నించారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడానికి పలువురు ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి శనివారం వెళ్లగా సిబ్బందితో పాటు వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేసారు. కొద్ది నిమిషాలకే వైద్యాధికారి రాజేష్‌వర్మ ఆస్పత్రికి రావడంతో ఆయనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బంది పడుతున్నారని, పద్ధతి మార్చుకొని సమయపాలన పాటించాలని కోరారు. వైద్యసేవలు అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు పి.సన్యాసినాయుడు, పి.లక్ష్మినాయుడు, పి.శ్రీనివాసరావు, మద్దిల మురళి, దంగా భూలోక, చందక ఆనంద్ తదితరులు ఉన్నారు.

హరికథకు ఆద్యుడు ఆదిభట్ల


దాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎ.గోపాలరావు తదితరులు

విజయనగరం టౌన్: హరికథకు ఆద్యుడు ఆదిభట్ల అని, అటువంటి మహనీయుడు నడయాడిన నేలపై మనమంతా జన్మించడం పూర్వజన్మ సుకృతమని ఆదిభట్ల ఆరాధనోత్సవ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు పేర్కొన్నారు. ఆదిభట్ల 80వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వెన్‌లక్ లైబ్రరీలో ఉన్న దాసు విగ్రహానికి శనివారం పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు తొలి అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. హరికథా పితామహునిగా యావత్ ప్రపంచ దేశాల్లోనే తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారన్నారు. అటువంటి మహనీయున్ని స్మరించుకోవడం మన విధి అని, ఆయన ఆశయాలను భావితరాలకు గుర్తు చేయాలన్నదే ఆరాధనోత్సవ సంఘం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు కాళ్ల నిర్మల భాగవతారిణి, భోగరాజు సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పరథంతో ప్రజాచైతన్యం


సంకల్పరథంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను యువతకు వివరించి, వారిని చెడు అలవాట్లకు దూరం చేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సంకల్పరథంతో ప్రచారం చేపడుతున్నామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం చైతన్య డిగ్రీ కళాశాల, తదితర ప్రాంతాల్లో సంకల్పరథాన్ని నిలిపి, వీడియోలు ప్రదర్శించి విద్యార్థులకు, యువతకు, ప్రజలకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభవాలపై అవగాహన కల్పించారు. రహదారి భద్రత, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ రామ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు..


పంట మార్పిడి చేయడంతో ఏపుగా పెరిగిన వంగ పంట

- ప్రతి ఏడాదీ ఒకే పంట సాగుతో అనర్థాలు
- మిశ్రమ పంటలతో చీడపీడల నుంచి రక్షణ

రామభద్రపురం:

రైతులు ఏటా సాగు చేసే పంటల్నే మళ్లీ మళ్లీ వేస్తుండడంతో భూమిలో సారం తగ్గిపోతుంది. పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గి తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. పంట మార్పిడి లేకపోవడంతో చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. లాభదాయకంగా ఉండే వాణిజ్య పంటలను రైతులు ప్రతి సీజన్‌లో క్రమంగా సాగు చేస్తుండడం వల్ల భూసారం క్షీణిస్తోంది. రెండు, మూడు సంవత్సారాలకొకసారైనా పంట మార్పిడి చేస్తే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుంది. పంట మార్పిడితో భూమిలో నీటి నిల్వలు పెరిగి భూసారం పెరిగి చీడపీడలు దూరమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పలు సూచనలు, సలహాలు అందించారు.

పంట మార్పిడితో లాభదాయకం..

నేను ప్రతీ ఏడాది వరి పంట సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాను. నాలుగైదేళ్లుగా పంట మార్పిడి చేస్తున్నాను. ఒక ఏడాది మొక్క జొన్న, మరో ఏడాది కూరగాయలు, ఇంకో ఏడాది పత్తి సాగు చేయడం వల్ల దిగుబడులు పెరిగి లాభదాయకంగానే ఉంది.మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉంటే కూరగాయల పంటలపై మంచి లాభాలు వస్తాయి.

– చింతల అప్పలనాయుడు, రైతు, రామభద్రపురం

అధిక దిగుబడులు..

పంట మార్పిడి విధానం వల్ల భూమిలో నాణ్యతతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే పంటల మార్పిడితో మొక్కల వేర్ల బుడిపెలోని రౌజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తుంది. మార్కెట్‌లో పంటకున్న డిమాండ్‌ను బట్టి పంట మార్పిడి చేసుకుంటే ధర స్థిరీకరణ ఉంటుంది. ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు.

– పి. మోహనకృష్ణ, మండల ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం


రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ

పంట మార్పిడి వల్ల లాభాలెన్నో..

- చీడపీడల్ని అదుపులో ఉంచొచ్చు.
- ఒక పంటను ఆశించే చీడపీడలు రెండో పంటకు అంతగా ఆశించవు.
- పంట మార్పిడిలో రెండు లేదా మూడు పంటల్ని అంతర పంటలుగా పండించడం వల్ల ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు లేకున్నా మరో పంట వల్ల నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు.
- పంటల మార్పిడితో వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- సస్యరక్షణ కోసం వాడే పురుగు మందులు ఖర్చు తగ్గుతుంది.
- వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లతో పాటు వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లు ఒకేసారి వేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థవంతంగా వినియోగించబడతాయి.
- పత్తి వేసిన పొలంలో మినప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో సాగు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- మిరప పంట సాగు చేయడానికి ముందు భూమిలో జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి బాగా కలియదున్నాలి.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే వాటిని ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలు నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పు ధాన్యాల పంటల్ని కాని నూనె గింజల పంటల్ని కాని సాగు చేయడం వల్ల వరిని తెగుళ్ల ఆశించకుండా ఉంటాయి.
- తేలికపాట నేలలు, ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటల్ని సాగుచేసుకోవచ్చు.
- వేరుశనగ, కంది, పప్పు శనగ, తదితర తృణ ధాన్యాల్ని సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుంది.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి
- ప్రచార రథం ప్రారంభం


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించే ఆటో ప్రచార రథాన్ని శనివారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించగలిగితే అంత అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డాక్టర్ అర్చనదేవి తదితరులు పాల్గొన్నారు.